# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 194. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.19.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## మూడోసారి విచారణకు క్రిశాంక్

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 18:అమృత్ తెలంగాణ: కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఏఐ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ మూడోసారి విచారణ కోసం శుక్రవారం గచ్చిబౌలి పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విచారణ పేరిట రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నదని, ఎట్టిపరిస్థితిలో భయపడేది లేదని తెలిపారు. ఇప్పటికే మూడుసార్లు విచారణకు పిలిచినా ఒరిగిందేమీ లేదని, ఈ నెల 23న నాలుగోసారి విచారణకు రావాలని మళ్లీ నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. విచారణలో అడిగిందేమీ లేదని, కాలయాపన కోసమే ఇందంతా చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల్లో పాల్గొనకుండా ఇబ్బందులు పెడుతున్నట్టు ఆరోపించారు.

## ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలపై సర్కారు అధిపత్యం కొత్తగా హైయ్యర్ ఎడ్యుకేషన్ రిఫార్మ్స్ బిల్లు

హైదరాబాద్, ఏప్రిల్ 18 అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలను తమ నియంత్రణలోకి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ఇందుకోసం కొత్తగా హైయ్యర్ ఎడ్యుకేషన్ రిఫార్మ్స్ బిల్లును సిద్ధం చేసింది. ఈ బిల్లు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. దీనిని అసెంబ్లీలో పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 10 ప్రైవేట్, 4 డీమ్డ్ వర్సిటీలున్నాయి. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు ముందే ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో సీట్లు నిండిపోతుండటంతో ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నది. ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల మంజూరుపై ఉన్నత విద్యామండలి, సర్కారు పలుమార్లు యూజీసీకి లేఖలు రాశాయి. తమను సంప్రదించిన తర్వాతే కొత్తగా ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలను మంజూరు చేయాలని యూజీసీకి రాసిన లేఖల్లో పేర్కొన్నాయి.

# ‘వక్ఫ్’పై తదుపరి విచారణ వరకు యధాతథ స్థితి

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: వక్ఫ్ సవరణ చట్టంపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంది. వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయవద్దని, అలాగే సెంట్రల్ వక్ఫ్ బోర్డు, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించవద్దని ఆదేశించింది. వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటుపై సుప్రీంకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించి తమను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం రోజులు గడువు కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పివి సంజరు కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణ జరిగే వరకు వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని కేంద్రం తెలియజేసింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించొద్దని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది.

కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వుందన్నారు. ప్రభుత్వానికి లక్షల కొద్దీ మెమొరాండాలు, విజ్ఞప్తులు, అభ్యంతరాలు అందాయని, వాటి ఆధారంగానే తాము ఈ నిబంధనలను రూపొందించామని చెప్పారు. ఉదాహరణకు గ్రామాలకు గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించారని, ప్రజల వ్యక్తిగత ఆస్తులను కూడా అలాగే వక్ఫ్ ఆస్తులుగా తీసుకున్నారన్నారు. ఇది కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన చట్టం, ఇందులో పెద్ద సంఖ్యలో అమాయకుల భూ, ఆస్తి హక్కులకు సంబంధించిన అంశాలు వున్నాయన్నారు. ఇది ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కొన్ని పత్రాలతో సహా కోర్టుకు సమాధానం దాఖలు చేసేందుకు వారం రోజులు సమయం కావాలని కోరారు. ఈ అంశంపై వంద సంవత్సరాల కాలంలోని మొత్తం చట్టాల పరిధి, కొత్త చట్ట నిబంధనల రూపకల్పనకు దారితీసిన, దేశవ్యాప్తంగా అందిన అనేక మెమొరాండాలతో కలిపి మొత్తంగా ప్రభుత్వ స్పందన తెలియజేస్తామని మెహతా చెప్పారు. అప్పటి వరకు బోర్డు, కౌన్సిల్ నియామకం ఉండదని సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి గణనీయమైన మార్పులు చోటు చేసుకోరాదని అన్నారు. కొత్త చట్టానికి ముందుగా వక్ఫ్‌లకు సంబంధించిన పరిస్థితుల్లో కొన్ని బలహీనతలు వున్నాయని



చీఫ్ జస్టిస్ అన్నారు. 2025 చట్టంలోనూ కొన్ని సానుకూల అంశాలు వున్నాయన్నారు. ఈ చట్టంపై పూర్తిగా స్టే విధించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను కోర్టు బుధవారం తిరస్కరించింది. అదే సమయంలో ఈనాడు ఏవైతే పరిస్థితులు నెలకొన్నాయో వాటిని పూర్తిగా మార్చివేసేలా, పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రభావితం చేసేలా చేయాలనుకోవడం లేదని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. దానిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మళ్లీ స్పందిస్తూ, వారం రోజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, తాము చట్టంలోని సెక్షన్ 9, 14 కింద ఎలాంటి నియామకాలు చేపట్టబోమన్నారు. సిజెఐ జోక్యం చేసుకుంటూ తదుపరి విచారణ వరకు ఎలాంటి మార్పులు ఉండకూడదని చెప్పగా, ఎస్‌జి స్పందిస్తూ ఏ రాష్ట్రమైనా నియామకాలు చేస్తే చట్టబద్ధంగా పరిగణించకూడదన్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఎస్‌జి వ్యాఖ్యలు రికార్డు చేసినట్లు పేర్కొంది. కౌన్సిల్, బోర్డులో ఎలాంటి నియామకాలు జరగవని ఎస్‌జి కోర్టుకు హామీ ఇచ్చారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. తదుపరి విచారణ వరకు ఎలాంటి నియామకాలు జరగకూడదని, వక్ఫ్ బై యూజర్‌గా పేర్కొన్న వాటితో పాటు నోటిఫికేన్ ద్వారా రిజిస్టర్ అయినవి, డీ నోటిఫై చేయకూడదంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేస్తూ, అప్పటి వరకు యథాతథ స్థితి కొనసాగుతుందని పేర్కొంది.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు.. నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి,

వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మేలో అంతరిక్షయానానికి శుభాన్షు శుక్లా సిద్ధం


న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: భారత వ్యోమగ్యామి శుభాన్షు శుక్లా మేలో అంతరిక్షయానం చేయనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ శుక్రవారం ప్రకటించారు. 40 ఏళ్ల క్రితం రాకేష్ శర్మ అంతరిక్షయానం చేసిన తరువాత భారత్ నుంచి ఒక వ్యోమగామి మళ్లీ అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే మొదటిసారి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), అంతరిక్ష విభాగం కార్యక్రమాలపై సమీక్ష తరువాత మంత్రి ఢిల్లీలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా వచ్చే నెలలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి శుభాన్షు శుక్లా వెళ్లనున్నట్లు చెప్పారు. ‘గ్రూపు కెప్టెన్ శుక్లా విమానానికంటే చాలా ఎక్కువగా ప్రయాణం చేయనున్నారు. ఇది అంతరిక్ష పరిశోధన కొత్త యుగంలోకి భారతదేశం ధైర్యంగా అడుగుపెడుతుందనడానికి సంకేతం’ అని మంత్రి తెలిపారు. ఇస్రో హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రామ్ కింద శుక్లాను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆక్సియం-4 మిషన్‌లో శుక్లా ప్రయాణం అంతరిక్ష ప్రయాణ కార్య కలాపాలు, ప్రయోగ ప్రోటోకాల్‌లు, మైక్రో గ్రావిటీ అనుసరణ, అత్యవసర సంసిద్ధతలో భారత్‌కు కీలకమైన అనుభవాన్ని అందిస్తుందని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ భవిష్యత్‌లో నిర్వహించనున్న స్పేస్ మిషన్లపై ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు.



నాసాతో ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నైసర్ ఉపగ్రహాన్ని జూన్‌లో జీఎస్ఎల్‌వి మార్క్ 2 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నారు. జులైలో అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 అనేఉపగ్రహాలను ఇస్రో తన ఎల్‌విఎం-3 రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపనుంది.

# హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం..

అమృత్ తెలంగాణ: హైదరాబాద్ నగర పరిధిలో పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నది. ఎస్ఆర్‌నగర్, బోరబండ, అమీర్‌పేట, పంజాగుట్ట, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కోఠి, సుల్తాన్‌బజార్, బేగంబజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, నారాయణగూడలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానపడుతున్నది. మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, కార్వాన్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, మారేడ్‌పల్లితో పాటు కుత్బుల్లాపూర్ పరిసరాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుంది. గుండ్లపోచంపల్లి, దుండిగల్, దూలపల్లి, బహదూర్‌పల్లి, మియాపూర్, నానక్‌రామ్‌గూడలో వానపడుతున్నది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చైతన్యపురి, దిల్‌షుఖ్‌నగర్, మియాపూర్, గచ్చిబౌలి,



వనస్థలీపురం తదితర ప్రాంతాల్లో వానకురుస్తుంది. గాంధీ భవన్ ప్రాంతంలో భారీ చెట్టు నేలకూలింది. చంపాపేట, సైదాబాద్, సరూర్‌నగర్‌తో ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతున్నది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. మరో వైపు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రాబోయే గంటలో హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# అమిత్ షా కాదు.. ఏ షా కూడా తమిళనాడును పాలించలేడు: ఎంకే స్టాలిన్

చెన్నై: అమృత్ తెలంగాణ: తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బీజేపీపై మండిపడ్డారు. ఢిల్లీలోని ఏ శక్తి కూడా దక్షిణాది రాష్ట్రాన్ని ఎప్పటికీ పాలించలేదని అన్నారు. అమిత్ షా కాదు, ఏ షా కూడా తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేయలేడంటూ బీజేపీని సవాల్ చేశారు. తిరువళ్లూరు జిల్లాలో జరిగిన బహిరంగ కార్యక్రమంలో సీఎం ఎంకే స్టాలిన్ మాట్లాడారు. అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు నేపథ్యంలో 2026 ఎన్నికల్లో తమిళనాడులో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. ‘నేను ఆయన (అమిత్ షా)కు సవాలు విసురుతున్నా. ఢిల్లీ ముందు తమిళనాడు ఎన్నటికీ లొంగదు. ఒక్క అమిత్ షా మాత్రమే కాదు, ఏ షా కూడా తమిళనాడును పాలించలేరు’ అని అన్నారు. కాగా, బీజేపీ ఎన్నికల వ్యూహాలను సీఎం స్టాలిన్ తోసిపుచ్చారు. ఈడీ దాడులతో నేతలను భయపెట్టడం, పార్టీని విచ్ఛిన్నం చేసే ఫార్ములాలు తమిళనాడులో పని చేయవని అన్నారు. ‘మీరు కలిగించే అన్ని అడ్డంకులను చట్టబద్ధంగా మేం విచ్ఛిన్నం చేస్తాం. మిమ్మల్ని మీరు మోసం చేసుకోకండి. 2026లో మళ్లీ ద్రవిడ నమూనా ప్రభుత్వమే ఏర్పడుతుంది’ అని అన్నారు. మరోవైపు తమిళనాడు ఎప్పుడూ ఢిల్లీ నియంత్రణలో లేదని, అలా ఉండబోదని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. ‘ఢిల్లీ ముందు తలవంచడానికి మేం బానిసలం కాదు. ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్ జీవించి ఉన్నంత వరకు మీ ప్రణాళికలు పనిచేయవు’ అని అన్నారు. తాము అడిగేవి



కేకలు కాదని తమిళనాడు హక్కులని చెప్పారు. ‘నేను సీటు కోసం ఎవరి ముందు ఏడవను లేదా మోకాళ్లపై పడను’ అని ప్రధాని మోదీకి కౌంటర్ ఇచ్చారు. కాగా, ఆత్మగౌరవం, ధైర్యం, గర్వంతో తమ భూమి నిండి ఉన్నదని స్టాలిన్ అన్నారు. ‘ఇక్కడ ఒక్కడిని బెదిరించి, పొత్తులు పెట్టుకుని మీరు గెలువగలరా? మీకు కావాల్సిన వారందరినీ తెచ్చుకోండి.. చూద్దాం’ అంటూ బీజేపీకి సవాల్ విసిరారు.

# కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ జరపాలి

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: ప్రధాని మోదీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. పర్యావరణంపై ప్రధానిగా తన చిత్తశుద్ధి, బాధ్యతను నిరూపించుకోవాల్సిన సమయం ఇది. కంచగచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ జరిపి కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలి. హెచ్‌సీయూలో జరిగిన విధ్వంసం విషయంలో మోదీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. హెచ్‌సీయూలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన విధ్వంసంపై ప్రధాని మోదీ మాట్లాడింది కేవలం బూటకం కాకుంటే చర్యలు తీసుకోవాలి. కంచ గచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసం. కాంగ్రెస్ చేసిన ఆర్థిక మోసంపై ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐ, ఆబీఐ, సెబీ, ఎన్ఎఫ్ఐఓలకు



ఆధారాలతో సహా తెలియజేశాం. ఆర్థిక అవకతవకలు జరిగినట్టు కేంద్ర సాధికార కమిటీ కూడా నిర్ధారించింది. స్వతంత్ర విచారణ చేయాలని కేంద్ర సాధికార కమిటీ సూచించింది. ఆర్థిక అక్రమాలపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి. నగరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. నిస్సిగ్గుగా, అక్రమంగా పర్యావరణ విధ్వంసం చేసిన రేవంత్ రెడ్డి లాంటి నాయకులను ప్రజల ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉంది. కంచ గచ్చిబౌలిలో రూ.10 వేల కోట్ల ఆర్థిక అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలి. ప్రధానిగా పర్యావరణ పరిరక్షణ, నిర్వహణపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి కాదని, కుమ్మక్కు రాజకీయాలు చేయడం లేదని నిరూపించుకోవాలి.

## రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించండి.. కర్నాటక సీఎంను కోరిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: విద్యా వ్యవస్థలో కుల వివక్షను నిర్మూలించేందుకు రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించాలని కర్నాటక సీఎం సిద్ధరామయ్యను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోరారు. ఈ నేపథ్యంలో ఆయన ఓ లేఖ రాశారు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని రూపొందించాలని కోరారు. తన జీవిత కాలంలో బీఆర్ అంబేద్కర్ కూడా కుల వివక్ష ఎదుర్కొన్నారని తన లేఖలో రాహుల్ హైలెట్ చేశారు. అంబేద్కర్ ఎదుర్కొన్న వివక్షను రాహుల్ తన లేఖలో ప్రస్తావించారు. తమ వద్ద ఆహారం ఉన్నా.. అంటరానివాళ్ల కావడంతో నీళ్లు ఎవరూ ఇవ్వలేదని, దీంతో తిండి తినలేకపోయినట్లు అంబేద్కర్ స్టోరీని రాహుల్ గుర్తు చేశారు. తన అభ్యర్థనను కర్నాటక సీఎం సిద్ధరామయ్య అంగీకరిస్తారని, అంబేద్కర్ ఎదుర్కొన్న సిగ్గు చేటు అని, దేశంలో మరో విద్యార్థి అలాంటి బాధకు గురికావొద్దు అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యా వ్యవస్థలో ఇప్పటికీ వివక్ష ఎదుర్కొడం సిగ్గుచేటు అని రాహుల్ తెలిపారు. రోహిత్ వేముల, పాయల్ తద్వి, దర్శన సోలాంకి లాంటి వారు హత్యకు గురయ్యారని, దీన్ని ఆమోదించలేమని, దీనికి ముగింపు పలకాలని, అంబేద్కర్ లాంటి పరిస్థితిని ఎవరూ ఎదుర్కోకుండా ఉండేందుకు రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించాలని కర్నాటక ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు రాహుల్ తెలిపారు. ఏప్రిల్ 16వ తేదీన ఆ లేఖ రాశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న రోహిత్ వేముల 2016లో కుల వివక్ష తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

## మైసమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి : ఎమ్మెల్యే తలసాని

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 18 :అమృత్ తెలంగాణ: మైసమ్మతల్లి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో జ్యువెల్లరీ వ్యాపారి మహేందర్ నికుంజ్ సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు.

# జొన్నల కొనుగోలు కేంద్రంలు ప్రారంభం

## - పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిందే ఆనందరావు పటేల్,





జొన్నలను తూకం వేస్తున్న దృశ్యం

### జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మార్కెట్ కమిటీ చైర్మన్

నిర్మల్ జిల్లా ముధోల్ ఏప్రిల్ 18 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గం లో పలు మండల కేంద్రాల్లో మరియు గ్రామాల్లో వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో రబీ సీజన్ సందర్భంగా జొన్నల కొనుగోలు కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్, మరియు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిందే ఆనందరావు పటేల్, ప్రారంభించారు. ప్రధానంగా మిర్జాపూర్ వ్యవసాయ సంఘానికి సంబంధించి మాటేగాం గ్రామంలో, కుబీర్ కు సంబంధించి కుబీర్ మండల కేంద్రంలో, కుంటాల మండలానికి సంబంధించిన కొనుగోలు కేంద్రాలు కల్లూరు, పెంచికల్ పాడ్,అంబకంటి, ఓలా, లింబ(కే) గ్రామాల్లో ఇట్టి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు పరస్పర సహకారం అందిస్తూనే, అవసరమైన సందర్భంలో రైతు పండించిన ప్రతి పంట గింజని మద్దతు ధర చెల్లించి కొనడానికి సిద్ధంగా ఉందని అన్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోవద్దని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో రైతు రాజ్యాన్ని ఏర్పాటు చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు వరుసలో ఉందని వారు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని నొక్కి చెప్పారు. రాష్ట్రంలో అనేక మంది రైతులు అప్పుల బాధతో ఉక్కిరిబిక్కిరి అయి ప్రాణాలు వదులుకుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం లక్షల్లో లోను మాఫీ చేసిందని అన్నారు. వరంగల్ డిక్లరేషన్ లో పునరుద్ఘాటించిన విధంగా కనీస మద్దతు ధర ప్రతి పంటకు ఉంటుందని, గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం రైతు పండించిన పంటకు కనీసం మద్దతు ధర కూడా ఇవ్వకుండా అనేక కష్టాల పాలు చేసిందనీ విన్నవించారు.



కుంటాలలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

రైతులకు కావాల్సిన సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం మరియు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని రైతులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సలహాలు సూచనలు పర్యాలోకి తీసుకొని వ్యవసాయ రంగంలో రాష్ట్ర రైతంగం ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి మరియు వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు కు జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు మరియు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'అభివృద్ధి' రాష్ట్రంలో కుల రక్కసి

అమృత్ తెలంగాణ : భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశమని చెప్పే పాలకులు, గుజరాత్ని మాత్రం అభివృద్ధి చెందిన రాష్ట్రంగా కీర్తిస్తారు. మోడీ ముఖ్యమంత్రిగా అక్కడ జరిగిన అభివృద్ధి దేశంలో మరెక్కడా జరగలేదని గప్పాలు పలుకుతారు. అయితే వాళ్లు చెప్పే అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాల్లో కాదుబీ అగ్రకుల అహంకారంతో నిమ్న కులాల అణిచివేత అక్కడ విపరీతంగా పెరిగిపోయింది. కులం పేరుతో షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలు నిత్యం వేధింపులకు గురవుతున్నారు. రాష్ట్రంలో 7 శాతం జనాభా మాత్రమే ఉన్న వీరి ఓటు బ్యాంకుపై పాలకులు పెద్దగా ఆసక్తి చూపరు. దీంతో మోడీ గారి ఏలుబడి నుండి వీరిపై దాడులు పెరిగిపోయాయి.

32 ఏళ్ల శైలేష్భారు చెన్వా. దినసరి కూలీ చేసుకుని జీవిస్తున్నాడు. గుజరాత్ ఉత్తర ప్రాంతం ఇదార్ నగరంలోని వడోల్ గ్రామంలో ఉంటాడు. అతను పనికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ముఖాన్ని ఓ గుడ్డతో కప్పుకుని వెళుతున్నాడు. అతను వేసుకున్న బనీనుని దాటుకుని ఒంటిపై నీలం రంగు, నల్లగా కమిలిన దెబ్బలు బయటికి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతనేమీ అనారోగ్యంతో బాధపడడం లేదు. అయినా ఆ గాయాలు, ముఖాన్ని దాచుకోవడం వెనుక శైలేష్కి జరిగిన ఘోర అవమానం ఉంది.

2025 మార్చి 11న ఎప్పటిలాగే శైలేష్ పనికి వెళ్లాడు. వచ్చేటప్పుడు అగ్రవర్ణ ఠాగూర్ల గుంపు అతన్ని కిడ్నాప్ చేసింది. దారుణంగా కొట్టింది. గాయపర్చింది. ఒళ్లంతా రక్తం కారుతున్న శైలేష్కి ఎందుకు తనని కొడుతున్నారో కూడా తెలియదు. బాధతో మూలుగుతున్న అతన్ని చూసి కూడా ఆ గుంపు ఆవేశం తగ్గలేదు. శైలేష్ ఒంటిపై బట్టలన్నీ విప్పించి నగంగా ఊరంతా తిప్పారు. ఆ రోజును తలుచుకుంటూ శైలేష్ ఇలా చెప్పాడు. 'నన్ను బాగా కొట్టి, క్షమాపణ లేఖ రాయించుకున్నారు. ఆ తరువాత నగంగా ఊరేగించారు. ఇంకోసారి ఠాగూర్ మహిళలతో మాట్లాడావో ఊరుకోం అని హుకుం జారీచేశారు. ఒంటిపై బట్టలు లేకుండా ఊళ్లో అందరి ముందూ అలా తిప్పుతుంటే ఎంత బాధనిపించిందో మాటల్లో చెప్పలేను. ఒక జంతువులా భావించేంత నరకం అనుభవించాను. ఆ దారుణాన్ని ఆపడానికి ఎవరూ ముందుకురాలేదు. అందుకే నా ముఖం ఇప్పటికీ ఎవరికీ చూపించలేకపోతున్నాను' అంటున్న శైలేష్ చేసిన నేరం – ఠాగూర్ మహిళతో తలెత్తి మాట్లాడడం.

పెళ్లి రోజున అవమానం

కిషన్భాయ్ సెన్మాది మరో అనుభవం. 2022లో అతనికి వివాహం నిశ్చయమైంది. ఎంతో సంతోషకరమైన పెళ్లిరోజున జీవితంలో మర్చిపోలేని చేదు అనుభవం అతనికి ఎదురైంది. ఆ పరిస్థితిని కిషన్ ఇలా చెబుతున్నాడు. 'ఆగస్టులో నా పెళ్లి రోజున వధువు ఇంటికి బయల్దేరాను. పూలతో నన్ను అలకరించారు. మేళతాళాలతో ఊరేగింపు ప్రారంభమైంది. సాంప్రదాయంగా వస్తున్న గుర్రపు స్వారీ ఎక్కి కూర్చున్నాను. అది ఠాగూర్ల కుర్రాళ్లు సహించలేకపోయారు. కులం పేరుతో తిడుతూ బలవంతంగా నన్ను దించేశారు. వాళ్లు నమ్మే మనుస్మృతి, మమ్మల్ని పురుగుల్లా, తెగుల్లా, పరాన్నజీవుల్లా అభివర్ణించింది. అందుకే అలా ప్రవర్తిస్తున్నారు. ఈ వివక్షని ఎన్నాళు భరించాలి? ఇక వారి ఆటలు చెల్లవు..' అంటూ ఆవేశంగా చెబుతున్నాడు.

కిషన్లో ఈ ఆవేశం అప్పుడు లేదు

ఆ రోజు గుంపు తనపై దాడి చేస్తున్నప్పుడు 'జీవితంలో ఇంకోసారి వాళ్లపై తిరగబడకూడదు' అనుకున్నాడు. కానీ ఆ అవమానం పదే పదే గుర్తుకొచ్చి మనసు తొలిచేస్తున్నప్పుడు నెల తరువాత వాళ్లపై కేసు ఫైల్ చేయాలని పోలీసు స్టేషనుకు వెళ్లాడు. అయితే అక్కడ కిషన్ ఫిర్యాదు తీసుకోవడానికి పోలీసులు సిద్ధంగా లేరు. సామరస్యంగా సమస్యని పరిష్కరించుకోమని తిప్పి పంపేశారు. "మాకు న్యాయం జరగాలంటే కోర్టు గుమ్మం ఎక్కడమే పరిష్కారమని మేం భావించాం" అని కిషన్ నిరాశావాదంతో చెబుతున్నాడు. గ్రామ పెద్ద 60 ఏళ్ల సుఖాభారు తన కళ్లెదుట ఇట్లాంటి ఎన్నో దారుణాలు చూశానని చెబుతోంది. 'మా బతుకులు హీనంగా తయారయ్యాయి. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రేపొద్దున అగ్రవర్ణాల వారు మమ్మల్ని చంపేసినా ఎవరికీ పట్టదు' అంటూ ఆమె గద్గద స్వరంతో మాట్లాడింది.

అమిత్షా దత్తత గ్రామంలో

బిలేశ్వర్ గ్రామాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్షా దత్తత తీసుకున్నారు. ఆ గ్రామం ప్రత్యేకతలుగా ఫ్యాక్టరీలు, ఇండిస్ట్రీయల్ భవనాలను చూపిస్తారు. 2024 జనవరి 29న అక్కడో దారుణం జరిగింది. పశువులు పోషించుకునే గీతాబెన్ ఇంటింటికీ వెళ్లి పాలు పితికి అమ్ముకుంటుంది. ఆ రోజు కూడా ఒక ఇంటి దగ్గర పాలు పితుకుతోంది. అక్కడికి దగ్గరలో కొంతమంది ఠాగూర్ కుర్రాళ్లు ఆడుకుంటున్నారు. బర్రెలు బెదురుతాయని వాళ్లని పక్కకి వెళ్లి ఆడుకొమ్మని ఆమె చెప్పింది. అంతే! ఆమెపై వాళ్లు విరుచుకుపడ్డారు. కులం పేరుతో నానా మాటలు అన్నారు. అడ్డువచ్చిన గీతాబెన్ కొడుకును కూడా కొట్టారు. పోలీసుల రాకతో గొడవ సద్దుమణిగింది. అయితే మరుసటి రోజు 200 మందికి పైగా గీతాబెన్ ఉంటున్న కాలనీకి వెళ్లి, ఇళ్లపై దాడులు చేశారు. రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో గీతాబెన్ కుటుంబంతో సహా చాలామందికి గాయాలు అయ్యాయి. 'ఇంత జరిగినా పోలీసులు కేసు ఫైల్ చేయలేదు. అసలు ఇప్పటివరకు దాడిలో పాల్గొన్నవారిని అరెస్టు చేయలేదు. పైగా నేను ఎఫ్ఐఆర్ నమోదు చేసిన గంటల వ్యవధిలోనే ఆ గుంపుతో కౌంటర్ ఎఫ్ఐఆర్ పెట్టించారు' అని గీతాబెన్ చెబుతోంది.

పశువులని చూస్తే భయం

ఈ దాడులు ఇప్పుడు, అప్పుడు అని కాదుబీ ఎప్పుడూ జరుగుతూనే ఉంటున్నాయి అనేందుకు మరో ఉదాహరణ ఉంది. ఇదార్లోని చిత్రోడి గ్రామంలో ఉంటున్న పత్తి రైతు సోమ్భారు చెన్వా, పశువులని చూస్తే చాలు తెగ భయపడిపోతున్నాడు. ఒక రైతుగా పశువులను ఇష్టపడే స్థితి నుంచి భయపడే స్థితికి పరిస్థితులు దిగజారాయి. ఆర్నెల్ల క్రితం అతని పొలంలోకి అగ్రవర్ణాలకు చెందిన పశువులను తోలారు. ఇదేమిటని సోమ్భారు ప్రశ్నించాడు. అదే అతను చేసిన పెద్ద తప్పు. వేధింపులు, దాడులు, కులం పేరుతో దూషించడం నిత్యం సోమ్భారు ఎదుర్కొంటున్నాడు. అంతకు ముందు 2019లో 65 ఏళ్ల దహ్యాబెన్ వంకర్పై టాగూర్ల గుంపు దాడిచేసింది. గాలిపటాల పందెంలో ఆమె మనవడు ఠాగూర్ల కుర్రాళ్లని ఓడించడం ఆమె చేసిన తప్పు. కొంతమంది పెద్దల మద్దతుతో దహ్యాబెన్ కేసు ఫైల్ చేసింది. అయితే ఆరేళ్లు గడుస్తున్నా ఆమెకి న్యాయం జరగలేదు. గతేడాది డిసెంబరులో జరగాల్సిన విచారణ కూడా నిందితులు హాజరుకాలేదని జరగలేదు.

ఇలా గుజరాత్లో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా నిమ్న కులాలపై దాడులు జరుగుతున్నాయి. వేలల్లో ఘటనలు జరుగుతున్నా, వందల్లో కూడా కేసులు నమోదు కావడం లేదు. నమోదైన వాటిలో న్యాయం జరిగేవి అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. అధికారం, డబ్బు, హోదాకి తోడు అగ్రకులం పేరుతో సాటి మనిషిని హింసించడం అక్కడ నిత్యకృత్యమైంది. చట్టం నేరమని చెబుతున్నా, పట్టించుకోని నిర్లక్ష్యం పాలకుల నరనరాన జీర్ణించుకుపోయింది.



అమృత్ తెలంగాణ బ్యూరో
సీనియర్ రిపోర్టర్ కేవల్ రాములు,

# న్యాయవాదిని సతకరించిన జిల్లా కోర్టు పిపి వినోద్ రావు



అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ : ఖానాపూర్ : శుక్రవారం నిర్మల్ జిల్లా కోర్టు పిపి కల్వకుంట్ల వినోద్ రావు గారు శుక్రవారం న్యాయవాది షబ్బీర్ పాషా నూతన గృహాన్నీ సందర్శించి వారికి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువా తో సత్కరించారు ఈ కార్యక్రమంలో మాజీ కో.అప్షన్ సభ్యులు డా.చాంద్ పాషా, సీనియర్ నాయకులు అనీస్ అహ్మద్ ఖాన్,న్యాయవాదులు వెంకట మహేంద్ర, సలీం ఖాన్,తోట సునిత్

# ఆపదలో ఉన్నవారికి ప్లేట్లెట్స్ దానం చేసిన వద్నప్ రాజేందర్



అమృత్ తెలంగాణ భైంసా న్యూస్ నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని పేషెంట్ అంకిత భర్త పేరు ప్రసాద్ గ్రామం వడ్గావ్.వయసు 23సంవత్సరాలు. GDR హాస్పిటల్ లో పేషంట్ కు ప్లేట్లెట్స్ తక్కువా అవడం వలన డాక్టర్ సుమాల మేడం చెప్పగానే బ్లడ్ డోనర్స్ గ్రూపులో పోస్ట్ చేసిన వెంటనే సమాజ సేవ కోసం ఎప్పుడు ముందు ఉండే వ్యక్తి రాజేందర్ మెసేజ్ చూసి ఫోన్ చేసిన వెంటనే స్పందించి జీవన్దాన్ రక్తనిధి కేంద్రానికి వచ్చి తన అమూల్యమైన ఏ పాజిటివ్ ప్లేట్లెట్స్ ఇవ్వడం జరిగింది . ఒక నిండు ప్రాణాన్ని కాపాడడం జరిగింది. రక్తం ఇచ్చిన దాత రాజేందర్ ప్రత్యేక ధన్యవాదములు. ఇపట్టి వరకు 7 టైమ్స్ ఇవ్వడం జరిగింది..ఇలాగానే ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను , ఈ కార్యక్రమంలో సురేష్ , అనిల్, ప్రసాద్ ,స్వప్నల్ ,బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు........రక్తదానం యొక్క ప్రాధాన్యత ఈ సంఘటన ద్వారా వద్నప్ రాజేందర్ చూపించిన ఆదర్శం సమాజంలో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుంది. ....ఆపదలో మేమున్నాం అని తెలియజేస్తున్నారు

# ఉద్యమకారుల ప్లీనరీ సమావేశమును విజయవంతం చేయండి ..

నిర్మల్ జిల్లా భైంసా ఏప్రిల్ 18 అమృత్ తెలంగాణ భైంసా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు మాట్లాడుతు తెలంగాణ, ఉద్యమ కళాకారుల వివిధ విభాగాల రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశం 21.4.2025 సోమవారం సికింద్రాబాదు సీతా పల్ మండి జిహెచ్.ఎం.సి ఫంక్షన్ హాల్ నందు జరుగు ప్లీనరీ సమావేశంలో నిర్మల్ జిల్లా ఉద్యమకారులు,ఉద్యమ కళాకారులు అందరూ పాల్గొని విజయవంతం చేయగలరని , తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, చాకటి లస్మన్న,నియోజకవర్గ అద్యక్ష్యులు పండిత్ రావు పటేల్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు పాయల శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : పేదలతో పాటు మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ లిఎంపీ నగేష్ బోరజ్ మండలంలోని పూసాయి గ్రామంలో భూభారతి అవగాహన సదస్సుకు హాజరై ఆయన మాట్లాడారు అనేక మంది పేదలకు ఇళ్ల స్థలాలు లేవని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే మీడియా మిత్రులకు సైతం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన అన్నారు ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు కాలేదని వాటిని రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు అలాగే ఆదిలాబాద్ లో కొమరం భీం కాలనీకి వస్తువులు కల్పించాలని కోరారు జొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేసిన కొనుగోళ్ళకి ఆంక్షలు విధించడంతో రైతులు విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడింది కొనుగోళ్లపై ఉన్న పరిమితిని పెంచితే రైతులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు దీనికి స్పందించిన మంత్రి పేదలతో పాటు మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా కృషి చేస్తానని అన్నారు

# సుల్తానాబాద్లో రఘునాథ చార్యుల శతజయంతి వేడుకలు



సుల్తానాబాద్, ఏప్రిల్ 18:అమృత్ తెలంగాణ: సత్ సంప్రదాయ పరిరక్షణ సభ పేరిట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు దక్షిణ భారతదేశంలోని అనేకమంది పండితులకు శిక్షణ ఇచ్చిన మహనీయుడు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస రఘునాథ ఆచార్యులవారని సుల్తానాబాద్ వికాస తరంగిణి కోఆర్డినేటర్ సాదుల సుగుణాకర్ అన్నారు. ఆచార్య రఘునాథచార్యుల శత తిరునక్షత్ర జయంతి వేడుకలను పురస్కరించుకొని పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

వికాస తరంగిణి ప్రజ్ఞ కోఆర్డినేటర్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల వనజ వెంకటరమణ దంపతుల నివాసంలో రఘునాథ చారుల వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళు లర్పించారు. ఆయన ధర్మ పరిరక్షణ కోసం సంప్రదాయ పరిరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలను, వారు రచించిన గ్రంథాలను ప్రస్తావిస్తూ ఆయన సేవలను కొనియాడారు. రఘునాథ ఆచార్యుల వారి శతజయంతి ఉత్సవాల పురస్కరించుకొని ఈనెల 20న వరంగల్లో ఏర్పాటు చేస్తున్న సభలో చిన్న జీయర్ స్వామి వారు పాల్గొంటున్నారని పలువురు పండితులకు రఘునాథ చార్ల వారి పురస్కారాలను ప్రదానం చేస్తారని సుగుణాకర్ తెలిపారు అనంతరం పలువురు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అన్నమనేని సప్న, సుగుణ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సునీత, చిట్టక్క తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్లో ఉత్తమ స్థానంలో నిలిచిన పెంబి బ్లాక్.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన నిర్మల్ జిల్లా పెంబి బ్లాక్ జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్, 3వ జోన్ లో 2 వ స్థానంలో నిలిచినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఎబిపి) కింద పెంబి బ్లాక్ అక్టోబర్ నెల నుండి డిసెంబర్–2024 త్రైమాసికానికి మొత్తం 500 బ్లాక్ లలో ర్యాంకింగ్స్లో జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్, 3వ జోన్ లో 2వ ర్యాంక్ను సాధించిందన్నారు. దీంతో పెంబి బ్లాక్ అభివృద్ధి కోసం 1 కోటి రూపాయల అవార్డును కూడా సాధించిందన్నారు. ఇది ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, ప్రాథమిక మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాలతో సహా, 40 రంగాల పనితీరు సూచికల ఆధారంగా ఈ ర్యాంకింగ్లు సాధ్యమైనట్లు తెలిపారు. జూలై 2024లో నిర్వహించిన సంపూర్ణనాత్ అభియాన్, పనితీరును మెరుగుపరచడంలో కూడా ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జిల్లా అధికారులు, పెంబి మండలం అధికారులు, ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్ ల కృషి, ప్రజల సహకారంతో ఈ అద్భుతమైన విజయం దక్కిందని కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# దిలాబాద్ జిల్లా నందు భూభారతి అవగాహన కార్యక్రమానికి విచ్చేయనున్న రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా నందు భూభారతి అవగాహన కార్యక్రమానికి విచ్చేయనున్న రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు అదే విధంగా పంచాయతీ శాఖ మాత్యులు శ్రీమతి ధనసరి అనసూయ(సీతక్క) గారి కార్యక్రమం నేపథ్యంలో హెలిపాడ్ వద్ద మరియు బోరజ్ మండలం పూసాయి గ్రామం నందు ఏర్పాటు చేసిన సభాస్థలి మరియు గ్రామపంచాయతీ భవనం, పూసాయి ఎల్లమ్మ మందిరం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్. ఆదిలాబాద్ జిల్లా నందు మంత్రుల కార్యక్రమం దృశ్య ప్రతిష్టమైన భద్రతా చర్యలను చేపట్టినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ గారి వెంట ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, డీఎస్పీలు సిహెచ్ నాగేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రకాశం బ్యారేజీ గురుంచి మీకు తెలుసా ?

విజయవాడ, అమృత్ తెలంగాణ: ప్రకాశం బ్యారేజి విజయవాడ వద్ద, కృష్ణా నది పై నిర్మించిన బ్యారేజి. దీని పొడవు 1,223.5 మీటర్లు (4,014 అడుగులు)దీని నిర్మాణ బాధ్యతలు ఈస్ట్ ఇండియా కంపెనీ కాలంలో సర్ ఆర్థర్ కాటన్ చేపట్టాడు.దీని నిర్మాణ 1852 లో ప్రారంభమై 1855 లో పూర్తయింది.కృష్ణా,గుంటూరు జిల్లాలలోని కృష్ణా డెల్టా ప్రాంతానికి సాగునీటిని అందించే నీటిపారుదల ప్రాజెక్టు ఈ ప్రకాశం బారేజి.ఇప్పటి బారేజి 1952లో నిర్మించబడినా,అంతకు 100 సంవత్సరాల కిందటే –1853లో – కృష్ణా నది జలాలను వినియోగించుకోవడాన్ని ఉద్దేశించిన మొట్టమొదటి నిర్మాణం జరిగింది.అదే కాటన్ ఆనకట్ట. తెలుగుదేశంలో సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన రెండు ప్రముఖ ఆనకట్టలలో ఇది రెండోది.మొదటిది, గోదావరి నదిపై గల కాటన్ బారేజి. 1832,1833 లలో ఈ ప్రాంతంలో భయంకరమైన కరువు ఏర్పడింది.డొక్కల కరువు,నందన కరువు, గుంటూరు కరువు,పెద్ద కరువు గా పేరుపొందిన ఈ కరువు వేలాది మందిని పొట్టన పెట్టుకుంది. ఎక్కడ చూసినా శవాలగుట్టలే కనిపించేవి.దాదాపు 40% ప్రజలు ఈ కరువుకు బలయ్యారు.బ్రిటిషు ప్రభుత్వం పన్నుల రూపేణా రూ.2.27 కోట్లు నష్టపోయింది. ఇంత తీవ్ర కరువులోనూ కృష్ణానది ఎండిపోలేదు. అయినా ఆ నీటిని వాడుకునే మార్గం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో కృష్ణ నీటిని సాగుకు వాడుకునే ఉద్దేశంతో నదిపై బెజవాడ (విజయవాడ) వద్ద ఆనకట్టను ప్రతిపాదించారు.ప్రతిపాదన కార్యరూపానికి రావడానికి మరో ఇరవై ఏళ్ళు పట్టింది.బెజవాడ వద్ద ఎడమ గట్టునగల ఇంద్రకీలాద్రి,కుడి గట్టున ఉన్న సీతానగరం మధ్య ఈ ఆనకట్ట నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఆనకట్ట నిర్మాణం 1853లో మొదలై,1854లో పూర్తయింది. 1132 మీ.పొడవు,4 మీటర్ల ఎత్తుతో అనకట్ట పైగుండా వరదనీరు



ప్రవహించేలా నిర్మించబడింది. రూ.1.49 కోట్లు ఖర్చయింది.10 ప్రధాన కాలువల ద్వారా సాగునీటి సరఫరా చేయడం మొదలుపెట్టారు.కాలువల నిర్మాణాన్ని కాటన్ శిష్యుడైన మేజర్ ఓర్ పర్యవేక్షించాడు. వంద సంవత్సరాలపాటు ఆనకట్ట ప్రజలకు వరప్రసాదమైంది.1952లో వచ్చిన వరదలకు అది కొట్టుకొని పోవడంతో మరో ఆనకట్ట ఆవశ్యకత ఏర్పడింది.పాత ఆనకట్ట కొట్టుకొని పోయిన వెంటనే కొత్త బారేజి నిర్మాణం మొదలయింది.పాత ఆనకట్టకు కొద్ది మీటర్ల ఎగువన బారేజిని నిర్మించారు.ఇసుక పునాదులపై నిర్మించిన ఈ బారేజి నీటి నియంత్రణకే కాక,24 అడుగుల వెడల్పుతో రోడ్డు,రోడ్డుకు రెండు వైపులా 5 అడుగుల వెడల్పుతో నడకదారి కలిగిఉంది.ఈ రోడ్డు చెన్నై,కోల్‌కతా జాతీయ రహదారిలో ఉంది.బారేజీకి తూర్పు,పడమరల్లోని కృష్ణా డెల్టా ప్రాంతంలోని 13.08 లక్షల ఎకరాలకు ఈ బారేజి నుండి సాగునీరు లభిస్తుంది. మహబూబ్‌నగర్ జిల్లా జూరాల వద్ద రాష్ట్రంలోకి ప్రవేశించి కృష్ణా జిల్లా నాగాయలంక,కోడూరు వద్ద రెండు పాయలుగా బంగాళాఖాతంలో కలిసే కృష్ణానదిపై చిట్టచివరి ఆనకట్ట ప్రకాశం బ్యారేజ్. విజయవాడకు ఎనలేని కీర్తి తెచ్చిపెట్టిన ఈ ఆనకట్ట తన 154 ఏళ్ల చరిత్రలో ఎన్నో సవాళ్లను అధిగమించింది.1832లో కృష్ణా తీరంలో కరవు వచ్చినప్పుడు నదిపై ఆనకట్ట కట్టాలనే ఆలోచన నాటి బ్రిటీష్ పాలకులకు వచ్చింది. సర్ ఆర్థర్ కాటన్ సారథ్యంలో,ఛార్లెస్ అలెగ్జాండర్ పర్యవేక్షణలో ఆనకట్ట నిర్మాణం 1852లో ప్రారంభమై 1855 మే 9న పూర్తైంది. 4014 అడుగుల పొడవుతో నిర్మించారు. దీనికి అయిన ఖర్చు రూ.1.4 కోట్లు. ఆయకట్టు 4.7 లక్షల ఎకరాలు.నీటి అవసరం పెరగడంతో 1893లో ఎత్తు మూడు అడుగులు పెంచారు. ఈ ఆనకట్ట వంద ఏళ్ల పాటు కచ్చితంగా సేవలందిస్తుందని కాటన్ అప్పట్లోనే ప్రకటించారని చెబుతుంటారు.1954 ఫిబ్రవరి 13 న మొదలైన బారేజి నిర్మాణం దాదాపు నాలుగేళ్ళలో పూర్తయింది. 1957 డిసెంబర్ 24 న బారేజిపై రాకపోకలు మొదలయ్యాయి.బారేజి నిర్మాణానికి రూ. 2.78 కోట్లు ఖర్చయింది.

# పెద్దమ్మతల్లి కల్యాణానికి పట్టు వస్త్రాల సమర్పణ

కామారెడ్డి, బిబిపేట్ ( దోమకొండ) ఏప్రిల్ 18:అమృత్ తెలంగాణ: దోమకొండ లోని పెద్దమ్మ కల్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి షబ్బీర్ అలీ తనయుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు ఇలియాస్ శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలోని అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణంలో పాల్గొని అమ్మవారికి అక్షింతలు వేసి ఆశీర్వాదాన్ని కోరుకున్నారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాది చంద్రకాంత్ రెడ్డిని ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరపు ఎల్లయ్య తోపాటు ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తీగల



తిరుమల్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శులు అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, నల్లపు అంజలి శ్రీనివాస్, పల్లె రామస్వామి గౌడ్, కొండ శ్రీనివాస్, కాంగ్రెస్ దోమకొండ అధ్యక్షుడు సీతారాం మధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పులబోయిన రమేష్, సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు పున్న లక్ష్మణ్, పురుషోత్తం, రాజేందర్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పడుకున్న వ్యక్తి గొంతు కోసిన గుర్తుతెలియని వ్యక్తి

వినాయక్ నగర్, ఏప్రిల్ 18:అమృత్ తెలంగాణ: రైల్వే స్టేషన్ లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి గొంతు ను మరో గుర్తు తెలియని వ్యక్తి బ్లేడుతో కోసి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయి రెడ్డి.. కథనం ప్రకారం.. ఈనెల 12న రైల్వే స్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద రాత్రి సమయంలో కుంచపు బాబు అనే వ్యక్తి నిద్రించాడు. అదే సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అతని వద్దకు వచ్చి అకారణంగా గొడవకు దిగి అతనిపై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా దుండగుడు తన వద్ద ఉన్న బ్లేడ్ తో పడుకున్న వ్యక్తి గొంతు కోసి అక్కడి నుండి పారిపోయాడు. తీవ్ర రక్తపు మడుగులో ఉన్న బాబును గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే గొంతు కోసి పారిపోతున్న గుర్తుతెలియని వ్యక్తి అన్నవాళ్లు రైల్వే స్టేషన్ లో గల సీసీ కెమెరా లో రికార్డయ్యాయి. ఈ ఘటనపై వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ రఘుపతి కేసు నమోదు చేసుకుని, కేసును రైల్వే



పోలీసులకు ట్రాన్స్ఫర్ చేశారు. ఈ మేరకు రైల్వే ఎస్సై సాయి రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్లేడుతో గొంతు కోసి పారిపోయిన ఈ దుండగుడిని గుర్తించిన వారు 8712658591 ఫోన్ నంబర్ కు సమాచారం ఇవ్వగలరని రైల్వే ఎస్సై పేర్కొన్నారు.

# రెడ్ హాట్ బికినీతో కిల్ చేసిన దిశా పటానీ



Instagram/dishapatani

రెడ్ హాట్ లుక్ తో వేడి పెంచడంలో దిశా పటానీని కొట్టేవాళ్లే లేరు. ఈ అందాల భామ బీచ్ బికినీ షోలకు అంతూ దరీ లేదు. నిరంతర వెకేషన్లతో యువతరానికి బోలెడంత ట్రీటిస్తోంది. తాజాగా మరోసారి బీచ్ లో దిశా పటానీ అందాల ఆరబోతలో చెలరేగిపోయింది. రెడ్ హాట్ బికినీ ధరించి అలా ఇసుక తిన్నెల్లో శయనించిన దిశా పటానీ ఫోజులు వైరల్ గా మారాయి. ఈ లుక్ లో దిశా పటానీ తన మేకప్ ను సింపుల్ గా ఉంచుతూ బంగారు చెవిపోగులు మెడలో బంగారు చైన్ తో స్పెషల్ గ్లామ్ ని యాడప్ చేసింది. దిశా పటానీ తన అద్భుతమైన ఫోటోగ్రాఫ్ లతో తన అభిమానుల హృదయాల్ని కొల్లగొడుతోంది. ఈ ఫోటోలను పోస్ట్ చేస్తూ తాను నిజమైన బీచ్ బేబ్ అని ప్రకటించింది. నెట్ ఫ్లిక్స్ యే కాళీ కాళీ ఆంఖేన్ దిశా పటానీని ఆకర్షించినట్లు కనిపిస్తోంది. షో- థీమ్ ట్రాక్ లో తాను డ్యాన్స్ చేస్తున్న వీడియోను షేర్ చేయడానికి దిశా తాజాగా ఇన్ స్టాగ్రామ్ లోకి వెళ్లింది. నెట్ ఫ్లిక్స్ సిరీస్ కి షారుఖ్ ఖాన్ బాజీగర్ చిత్రంలోని యే కాళీ కాళీ ఆంఖేన్ ఐకానిక్ పాట ను యాడప్ చేశారు. తన వీడియోతో దిశా YKKAGroove Instagram రీల్స్ ఛాలెంజ్ ని ప్రారంభించింది. ఇదే విషయం గురించి దిశా మాట్లాడుతూ నేను 90ల నాటి థ్రిల్లర్ ల అభిమాని - ఆకట్టుకునే సంగీతం- డ్రామా - యాక్షన్ - అవన్నీ మిమ్మల్ని కట్టిపడేసే పూర్తి ఎంటర్ టైనర్ లు. యే కాళీ కాళీ ఆంఖేన్ వీటి నుండి ప్రేరణ పొందుతుంది! నేను ఎప్పుడు Netflix కూడా ఐకానిక్ తరహా రెండిషన్ తో వస్తోందని విన్నాను.

# అప్పుడు మామ.. ఇప్పుడు అల్లుడు.. అమ్మడు సందడే సందడి!

ఇప్పుడు అల్లుడు సరసన నటిస్తోంది. మరో హిట్ కొట్టేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఎవరో కాదు మీనాక్షీ చౌదరి. మొన్న మామయ్యతో బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించిన ఆ హీరోయిన్.. ఇప్పుడు అల్లుడు సరసన నటిస్తోంది. మరో హిట్ కొట్టేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఎవరో కాదు మీనాక్షీ చౌదరి. విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో 2025ను సక్సెస్ ఫుల్ గా స్టార్ట్ చేసిన అమ్మడు.. నాగచైతన్య అప్ కమింగ్ మూవీలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే మామాఅల్లుళ్లతో వెంటవెంటనే స్క్రీన్ షేర్ చేసుకున్న హీరోయిన్స్ లో మీనాక్షీ చౌదరి ఒకరు. అదే సమయంలో నాగచైతన్య రీసెంట్ గా తండేల్ తో ఎలాంటి హిట్ అందుకున్నారో అందరికీ తెలిసిందే. శ్రీకాకుళానికి చెందిన కొందరు మత్స్యకారుల నిజజీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా చందూ మొండేటి తెరకెక్కించిన ఆ మూవీతో రూ.100 కోట్ల విజయాన్ని సాధించారు. స్టార్ బాయ్‌కి అది బిగ్ ఛాలెంజ్‌గా మారిందిగా! దీంతో ఇప్పుడు చైతూ అప్ కమింగ్ ప్రాజెక్ట్ 24పై అందరి ఫోకస్ పడింది. కొంత కాలం క్రితం రిలీజ్ అయిన విరూపాక్షతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ డైరెక్టర్ కార్తీక్ దండుతో సినిమా చేయనున్నారు నాగ చైతన్య. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ గా.. గ్రాండ్ గా సినిమా రూపొందనున్నట్లు కొద్ది రోజుల క్రితం వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. సినిమాలో చైతన్య రెండు కోణాలు ఉన్న రోల్ లో కనిపించనున్నారని తెలుస్తోంది. ఫుల్



గా మేకోవర్ చేసుకోనున్నారని సమాచారం. దీంతో కెరీర్ లో నెవ్వర్ బిఫోర్ పాత్రలో నటించనున్నారని వినికిడి. ఆయన సినీ కెరీర్ లోనే భారీ బడ్జెట్ సినిమా కానుందని, గ్రాఫిక్స్ పనుల కోసమే బడ్జెట్ లోని ఎక్కువ భాగం ఖర్చు చేయనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే విరూపాక్షలో తన దర్శకత్వ ప్రతిభ అంటే ఏంటో చూపించిన కార్తీక్ వర్మ.. పౌరాణికాలను, సస్పెన్స్ మిళితం చేసే మరో ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ గా %చీజ% 24ను అందించాలనే ఆసక్తిగా ఉన్నారని సమాచారం. మొత్తానికి చైతూ త్వరలోనే మరిన్ని అప్డేట్స్ తో మేకర్స్ సందడి చేయనున్నారని తెలుస్తోంది. దీంతో సినిమా కోసం అంతా వెయిట్ చేస్తున్నట్లు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.







# నభానటేష్ హాట్ టాప్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com